సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



ఉత్తర నక్షత్ర పడిపూజ

యైటింక్లయిన్‌కాలనీ: శ్రీఅయ్యప్ప స్వామి ఉత్తర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజ ఘనంగా నిర్వహించారు.



నేత్రదానంపై అవగాహన

రామగిరి: ఆర్జీ–3 డివిజన్ ఎంవీటీసీ కేంద్రం, సెంటనరీకాలనీ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీలో గురువారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/25.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మాతాశిశు ఆస్పత్రిలో మెరుగైన సేవలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో మెరుగైన ప్రసూతి సేవలు అందిస్తున్నారని, శస్త్రచికిత్సలు చేసి ప్రాణాలు రక్షిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన మౌనికకు ప్లేట్‌లెట్ తక్కువగా ఉన్నా..అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ప్లేట్‌లెట్, ప్లాస్మాట్రాన్స్‌ఫ్యూజ్ చేసి ఆపరేషన్ చేసి తల్లీబిడ్డలను కాపాడారని పేర్కొన్నారు. అలాగే పెద్దపల్లికి చెందిన సయ్యద్ చాందినికి ఆపరేషన్ చేసినపుడు రక్తస్రావం జరిగిందని, వెంటనే వైద్యబృందం అప్రమత్తమై అవసరమైన సేవలందించడంతో ఆరోగ్యంగా ఉన్నారన్నారు.మెరుగైన సేవలందించిన వైద్యులు, డీసీహెచ్‌ఎస్ శ్రీధర్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌ను కలెక్టర్ అభినందించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరణ



హైదరాబాద్‌లో అవార్డు స్వీకరిస్తున్న అంజన్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా గురువారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన గురు పూజోత్సవం కార్యక్రమంలో గూళ్ల అంజన్‌కుమార్ పురస్కారం అందుకున్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్‌లో జీవ శాస్త్రం బోధిస్తున్న అంజన్‌కుమార్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, కమిషనర్ శృతి ఓజా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అంజన్‌కుమార్ అవార్డు అందుకోవడంపై హెచ్‌ఎం జయరాజ్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ గజ్జి కృష్ణ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. వినాయక మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజేలు పెట్టవద్దని సూచించారు. సమావేశంలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, అశోక్‌రెడ్డి, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మద్దెల చెరువు మత్తడి ప్రాంతం పరిశీలన



మత్తడి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు


ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని నారాయణపల్లిలో మద్దెల చెరువు మత్తడివాగు పిచ్చిమొక్కలతో నిండి మూసుకుపోయింది. ఈక్రమంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీటితో చెరువు మత్తడి దూకి వాగులోకి చేరడంతో ఎటువైపు పోలేక గ్రామంలోని ఇళ్లలోకి చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులుపడ్డారు. దీంతో ఈ విషయాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించడంతో గురువారం ఈఈ జి.ప్రసాద్, డీఈఈ మహమ్మద్ సిరాజ్, ఏఈ ఆయూబ్‌అలీ మత్తడి వాగును సందర్శించారు. ఇళ్లలోకి వదర చేరిన తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిక అందజేసి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాడ కొండాల్‌రెడ్డి, నాయకులు సబ్బు శ్రీధర్, చింతిరెడ్డి నారాయణరెడ్డి, నరహరి సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కంకణాల రాజిరెడ్డి, సబ్బు శంకరయ్య, సబ్బు సంపత్, చొప్పరి అజయ్, పంచాయతీ కార్యదర్శి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై టాస్క్‌ఫోర్స్

- జిల్లాలో అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం
- ఇటీవల ఓ చెరువులో ప్రహరీ కూల్చివేత
- ఫిర్యాదులు పరిశీలించి కూల్చేస్తామంటున్న యంత్రాంగం



బంధం చెరువు బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత



తాళ్లకుంట చెరువుకు హద్దులు నిర్ణయిస్తున్న సర్వేయర్లు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో ఆక్రమణలపై యంత్రాంగం ఉక్కుపాదం మోపుతుంది. హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) తరహాలో జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కబ్జాదారుల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేసిన, చేస్తున్న వారిని గడగడలాడిస్తోంది. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని బంధం చెరువు బఫర్‌జోన్‌లో ఓ రియల్టర్ నిర్మించిన ప్రహరీని టాస్క్‌ఫోర్స్ బృందం నేలమట్టం చేసింది. త్వరలో మరికొన్ని అక్రమ నిర్మాణాలు కూల్చివేసేందుకు జిల్లాలో గతనెల కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ, నీటిపారుదల, ల్యాండ్ సర్వేయర్ తదితర శాఖలతో చేసిన టాస్క్‌ఫోర్స్ కూల్చివేతలకు కార్యాచరణ సిద్ధం చేస్తుంది.

హద్దుల నిర్ధారణ

- జిల్లా కేంద్రంలో 9.19ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తాళ్లకుంట, 65 ఎకరాల్లో ఉన్న బంధంపల్లి, 5.2 ఎకరాల్లో ఉన్న రంగంపల్లి చెరువుల్లోని బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లోని అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.
- యంత్రాంగం ఇప్పటికే వాటి హద్దుల నిర్ధారణ కోసం ఆయా చెరువుల పరిధిలో డీజీపీఎస్ (డిజిటల్ గ్లోబల్ పొజిషన్ సర్వే)తో ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించారు.
- తాళ్లకుంట చెరువు బఫర్‌జోన్‌లో డంపింగ్ యార్డ్ ఉన్నట్లు నిర్ధారించారు. అలాగే రంగంపల్లి చెరువు బఫర్‌జోన్‌లో ప్రభుత్వ హాస్టల్, ఒక చర్చి, నిర్మాణంలో ఉన్న భవనం ఉన్నట్లు, బంధంపల్లి చెరువు బఫర్‌జోన్‌లో 2 రేకుల షెడ్లు, లే అవుట్‌తో ఏర్పాటు చేసిన వెంచర్ ప్రహరీ, శ్మశానవాటిక ఉన్నట్లు అధికారులు గుర్తించారు.
- ఎల్లమ్మ చెరువు, గుండమ్మ చెరువుతో పాటు, ఎస్సారెస్పీ కెనాల్‌పై పలు అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. జిల్లాలో ఏమైనా అక్రమ నిర్మాణాలు ఉంటే డీఆర్‌డీవో పెద్దపల్లి.జీ మెయిల్‌కు మెయిల్ ఫిర్యాదు చేయవచ్చని లేదా నేరుగా రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని జిల్లా భూకొలతల శాఖ ఏడీ శ్రీనివాస్

15 అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు

హైడ్రా తరహాలో జిల్లాలో పెద్రా తరహా బుల్డోజర్ వ్యవస్థ ద్వారా చెరువులు, కుంటలను ఆక్రమించుకుని చేపట్టిన కట్టడాలను కూల్చివేయాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు. ఇప్పటికే కలెక్టర్, రెవెన్యూ, ఇరిగేషన్, ఎస్సారెస్పీ తదితర శాఖలకు 15 అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు ఫిర్యాదులపై రికార్డులు పరిశీలిస్తున్నారు. అక్రమాలని తేలితే వాటిపై కొరాడా ఝులిపించేందుకు సిద్ధమవుతున్నారు.

టెండర్ల దాఖలులో గలాట



ఇరువర్గాల వాగ్వాదం



డీఎం కార్యాలయంలో టెండర్ల బాక్స్

- పరస్పర ఘర్షణకు దిగిన లారీ అసోసియేషన్స్ ప్రతినిధులు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో వానాకాలం, ఎండకాలం సీజన్‌లలో సేకరించబోయే ధాన్యాన్ని తరలించేందుకు లారీల కేటాయింపు కోసం సివిల్ సప్లై శాఖ టెండర్లు ఆహ్వానించింది. జిల్లాలోని పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, రామగుండం సెక్టార్లకు సంబంధించి గురువారం సాయంత్రం 4గంటల వరకు టెండర్లు దాఖలు చేయడానికి గడువు ఇచ్చారు. అయితే దీనికి సంబంధించి జిల్లాలోని వివిధ లారీ అసోసియేషన్ సంఘాలు టెండర్లు వేశాయి. ఈనేపథ్యంలో రామగుండం సెక్టార్‌కు రామగుండం లారీ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ వారు టెండరు దాఖలు చేశారు. ఇదే సెక్టార్‌కు కాటారంకు చెందిన సాయిరాం ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్‌కి చెందిన రత్నకుమార్ సైతం టెండర్ దాఖలు చేసేందుకు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సివిల్ సప్లై మేనేజర్ కార్యాలయానికి వచ్చారు. దీంతో తమ పరిధిలోకి వచ్చి టెండర్లు ఎలా దాఖలు చేస్తారంటూ ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఈ గలాటలో రామగుండం ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కాటారంకు చెందిన లారీ టెండర్ల పత్రాలను ఎత్తుకెళ్లాడు. దీంతో జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం 11గంటలలోపు టెండర్లు వేయడానికి కాటారం అసోసియేషన్ వారికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. అలాగే టెండర్ పత్రాలు ఎత్తుకెళ్లిన శ్రీనివాస్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు డీఎం తెలిపారు.

సీఎంపీఎఫ్ త్వరగా అందించాలి



మాట్లాడుతున్న శ్రీహరి పచౌరి

గోదావరిఖని(రామగుండం): సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు త్వరగా సీఎంపీఎఫ్ నిధి అందించేలా చూడాలని కమిషనర్ శ్రీహరిపచౌరి అన్నారు. గురువారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సీఎంపీఎఫ్ సమస్యలపై కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎంపీఎఫ్, ఉద్యోగుల పెన్షన్‌కు సంబంధించి సీసీకేర్స్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ఏరియాకు సంబంధించిన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, పరిష్కార మార్గాలు, పెన్షన్, క్లెయిమ్‌ల వివరాలు తెలుసుకున్నారు. ఏటా ఉద్యోగికి సీఎంపీఎఫ్ జమ చిట్టీలను పంపిణీ చేసేలా చూడాలని, పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జీఎం చంద్రశేఖర్, ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, రవీందర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మంథని: కురుస్తున్న వర్షాలకు పత్తి, వరి పంటలకు నష్టం వాటిల్లిందని, పత్తిలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మంథని ఏడీఏ అంజని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం పంటలను పరిశీలించారు. వరి సాగు చేసిన రైతులు వరి గట్లను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరును వెంటనే పొలాల నుంచి తీసివేయాలన్నారు. మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ అంజని

గణపతి ఉత్సవాలపై ఫోకస్

- కమిషనరేట్‌లో గతేడాది 4,253 విగ్రహాలు
- ఈసారి మరింత ఎక్కువగా ఉండే అవకాశం
- విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి



ప్రతిష్ఠాపనకు ముస్తాబైన వినాయక విగ్రహాలు

గోదావరిఖని(రామగుండం): గణపతి నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ దృష్టి సారించింది. ఇప్పటికే రామగుండం పోలీస్‌కమిషనరేట్ కార్యాలయంలో రెండు జిల్లాల పోలీసు అధికారులు, అన్నిమతాల పెద్దలతో కమిషనర్ మిట్టు శ్రీనివాస్ శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం నిర్వహించారు. పలు డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పరిధిలో పీస్ కమిటీల సమావేశాలు ఏర్పాటు చేసి శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. ప్రధానంగా ఆయా కూడళ్లలో విగ్రహాల ఏర్పాటుకు పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. గణపతి నవరాత్రులతో పాటు మిలాద్–ఉన్–నబీ పండుగ రావడంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. మతవిద్వేషాలు ఏర్పడకుండా పండుగలను గౌరవప్రదంగా నిర్వహించుకోవాలని సూచించారు.

గతేడాది కమిషనరేట్‌లో..

గతేడాది రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో 1,981, పెద్దపెల్లి జోన్‌లో 2,272 మొత్తం 4,253 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈఏడాది వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునే భక్తులు పోలీసుల అనుమతి తప్పనిసరి అంటున్నారు. విగ్రహాల గుర్తింపునకు జియో ట్యాగింగ్ చేయనున్నారు.

సీసీ కెమెరాల బాధ్యత కమిటీలదే

- గణేశ్ మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత కమిటీలదే. పోలీసుల నిరంతర నిఘా కొనసాగనుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతీ విగ్రహం వద్ద ఇద్దరు తప్పనిసరిగా ఉండాలి. బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది నిరంతర తనిఖీ ఉంటుంది.
- విద్యుత్ సౌకర్యంకోసం ఆ శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. సోషల్ మీడియా పుకార్లు నమ్మి గొడవలకు ఆస్కారం ఇవ్వొద్దు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే డయల్ 100, కమిషనరేట్ కంట్రోల్ రూం నంబర్ 87126 56597, స్థానిక పోలీసులను సంప్రదించాలి.

ప్రతీ విగ్రహానికి జియో ట్యాగింగ్



కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసే ప్రతి వినాయక విగ్రహానికి జియోట్యాగింగ్ చేస్తాం. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా మరింత పెంచుతాం. సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు చేసి మత విద్వేషాలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటాం. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఆయా మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే డయల్ 100కు సమాచారం అందించాలి.

– మిట్టు శ్రీనివాస్, సీపీ, రామగుండం

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, పక్కన కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

పెద్దపల్లిరూరల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజంలో వారికి ఎనలేని గౌరవముంటుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన టీచర్స్ డే కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 42మందిని సత్కరించారు. ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను రూ.2 కోట్లతో మరమ్మతు చేస్తామని, పెద్దపల్లిలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు వృత్తిపట్ల శ్రద్ధ చూపి, విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా విద్యాబోధన చేస్తే ప్రత్యేక గుర్తింపు దక్కుతుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. చదువుతోపాటు క్రీడల్లో సైతం విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. విద్యాశాఖ అధికారులు హనుమంతు, రాంరెడ్డి, సమగ్ర శిక్ష సమన్వయకర్త పీఎం షేక్, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



విప్ అడ్లూరికి బీపీ చెక్ చేస్తున్న వైద్యురాలు

ధర్మారం(ధర్మపురి): ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నందిమేడారం రైతు వేదికలో నిర్వహించిన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో జిల్లా అధికారులతో మాట్లాడి హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటా తిరుగుతూ జ్వరపీడితులకు వైద్యంతో పాటు సలహాలు, సూచనలు అందిస్తున్నారని వివరించారు. వైద్య పరంగా ఎలాంటి అవసరం ఉన్న తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, వైద్యులు సుష్మిత, గౌతం, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, నాయకులు కొడారి హన్మయ్య, నర్సింహం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ తరహాలో రామగుండం హైస్కూల్

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

రామగుండం: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ బాల్యంలో చదువుకున్న బడిపై మమకారం చాటుకోవడంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించి సన్మానించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాఠశాలలో చదువుకున్నప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులకు వివరించారు. రామగుండం హైస్కూల్‌ను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని, నూతన భవన నిర్మాణంతో పాటు మౌలికవసతుల కల్పన, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, క్రీడా సామగ్రి, తదితర నిర్మాణాలకు రూ.2.40 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే సోదరుడు పూర్వ విద్యార్థి అయోధ్యసింగ్‌ఠాకూర్, బందారపు బుగ్గరాములుగౌడ్, హెచ్‌ఎం.శారద, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అంతర్గాం మండలం సోమనపల్లిలో గురువారం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ శంకుస్థాపన చేశారు. డీఎంఎఫ్‌టీ, మినరల్ ఫండ్ రూ.25 లక్షల వ్యయంతో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో అలీం, మాజీ ఎంపీపీ రాజలింగం, మడ్డి తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణంలో ఐటీ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించామని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని శాస్త్రినగర్, మార్కండేయ కాలనీలో భూములను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ర్యాకాల్‌దేవ్‌పల్లిలో 20 ఎకరాల స్థలాన్ని గుర్తించామని, అది ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే విజయరమణారావు ప్రతిపాదన చేశారని పేర్కొన్నారు. సుల్తానాబాద్, గర్రెపల్లి, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో స్థలాలను గుర్తించామని, మరిన్ని స్థలాలు గుర్తించేందుకు సర్వేయర్, ఆర్‌ఐ, ఇరిగేషన్, పలు శాఖల అధికారులతో సమన్వయంతో ముందుకు వెళ్తామని వివరించారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైన విషయం తమ దృష్టికి వచ్చిందని, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. ఇంటింటా బీఎల్‌వోలు ఓటరు సర్వే చేస్తున్నారని, ఈ నెల 15లోగా పూర్తి చేసిన తర్వాత ఆన్‌లైన్‌లో ఓటర్ల నమోదు చేపడతారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా తొమ్మిది గృహాలు వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్నాయని, వాటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించి బాధితులకు ఆర్థికసాయం చేసేలా చర్యలు చేపట్టినట్టు వివరించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దాడులకు పాల్పడితే కఠిన చర్యలు



ఆస్పత్రిలో భద్రత చర్యలపై వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ రమేశ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని పోలీస్ ఔట్‌పోస్టు కేంద్రాన్ని గురువారం వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డితో కలిసి ఏసీపీ రమేశ్ తనిఖీ చేశారు. ఔట్‌పోస్టు రికార్డులు పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఇతర విభాగాల ఉద్యోగులు, సిబ్బందితోపాటు పేషెంట్ల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై ఆర్‌ఎంవో డాక్టర్ అప్పారావుతో మాట్లాడారు. ఆస్పత్రి పోకిరీలు, గంజాయి సేవించి వచ్చే వారిపై నిఘా పెట్టాలని, అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. మద్యం తాగి వచ్చినవారికి బ్రీతింగ్ అనలైజర్‌తో పరీక్షించి, కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. విధుల్లో ఉన్న డాక్టర్లు, సిబ్బందిపై ఎవరైనా దురుసుగా ప్రవర్తించినా, దాడులకు పాల్పడినా చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు. జనరల్ వార్డును పరిశీలించి చికిత్స పొందుతున్న పేషెంట్లతో మాట్లాడారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది పనితీరు, ప్రవర్తనపై ఆరా తీశారు. అత్యవసరమైతే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆస్పత్రిలోని సీసీ కెమెరాల నిర్వహణపై వివరాలు సేకరించారు. ప్రజలకు కనిపించేలా పోలీస్ ఔట్‌పోస్టు కేంద్రంపై పేయింట్‌తో పెద్ద అక్షరాలు రాయించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

క్యూలైన్‌లో రాజన్న భక్తురాలి మృతి

• మృతురాలు సిద్దిపేట జిల్లావాసి



విజయ (ఫైల్)

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలు క్యూలైన్‌లోనే కుప్పకూలి, మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని చోటపల్లికి చెందిన కొత్తకొండ విజయ(50) గురువారం కుటుంబసభ్యులతో కలిసి వేములవాడ వచ్చింది. రాజరాజేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వెళ్తుండగా ఒక్కసారిగా కింద పడింది. స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోందని కుటుంబసభ్యులు తెలిపారు. విజయ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

వరద కాలువలో వృద్ధురాలి మృతదేహం

రామడుగు(చొప్పదండి): మండలంలోని షానగర్ శివారు వరద కాలువలో గురువారం ఉదయం ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు రామడుగు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని రామన్నపేటకు చెందిన పుల్లెల వెంకటమ్మ(82) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి, గ్రామ శివారులోని వాగులో దూకింది. నీటిలో కొట్టుకుపోయి, షానగర్ శివారులోని వరద కాలువలో గురువారం శవమై, కనిపించింది. మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఆమె కొడుకు శేఖర్ వచ్చి, మృతదేహాన్ని గుర్తించాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేందర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



ప్రవీణ్ (ఫైల్)

సైదాపూర్: మండలంలోని బొత్తల్లపల్లికి చెందిన మేడవేని ప్రవీణ్(25) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ప్రవీణ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది, బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

డెంగీతో వ్యక్తి మృతి

రుద్రంగి(వేములవాడ): డెంగీతో బాధ పడుతూ రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నోముల రవి(60) మృతిచెందాడు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రవి 15 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అయితే, ఓ ప్రైవేటు వైద్యుడు ఇంజెక్షన్ వేయడం వల్ల సెప్టిక్ అయిందని, మరో వైద్యుడు సెప్టిక్ అయిన చోట చీరడంతో రక్తస్రావమై రవి చనిపోయాడని స్థానికంగా చర్చ జరిగింది. ఈ విషయమై రుద్రంగి ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సారంగాపూర్(జగిత్యాల): అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కోట సంతోష్ రేషన్ లబ్ధిదారుల వద్ద 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి, తుంగూర్ గ్రామంలో నిల్వ చేశాడు. పోలీసులు పక్కా సమాచారంతో గురువారం రాత్రి వెళ్లి, పట్టుకున్నారు. సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



ఉపాధ్యాయురాలు సరస్వతికి పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా 42 మంది ఎంపికయ్యారు. ఈసందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన టీచర్స్ డే కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి పురస్కారం అందజేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



డి.సంతోష్ ఎంపీపీఎస్, ముత్తారం | ఎం.సిద్ధయ్య యూపీఎస్, మడక | ప్రభాకర్‌రెడ్డి ఎంపీపీఎస్, జీడీ నగర్



కె.రాజేశ్వరి, యూపీఎస్, విఠల్‌నగర్ | కె.పల్లవి, ఎంపీపీఎస్, వెన్నంపల్లి | బి.రమేశ్, ఎంపీపీఎస్, సుల్తానాబాద్ | వి.లత, కేజీబీవీ, అంతర్గాం | కె.శ్రీనివాస్, ఎంపీపీఎస్, బొంపల్లి | అనిల్‌ప్రసాద్, ఎంపీపీఎస్, శ్రీరాంపూర్ | ఎం.రాజేశ్వరి, ఎంపీపీఎస్, బేగంపేట



రాధాస్వామి, రేగడిమద్దికుంట | అరుణ, జెడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి | లక్ష్మి, జెడ్పీహెచ్ఎస్, గుంజపడుగు | ఎం.దీన, ప్రిన్సిపాల్, టీఎస్ఎంఎస్, ధర్మారం | మంజుల, కేజీబీవీ, రామగిరి | ఎస్.అనురాధ, జెడ్పీహెచ్ఎస్, బసంత్‌నగర్ | టి.శ్రీలక్ష్మి జీహెచ్ఎస్, మంథని | డి.సుధారాణి, జెడ్పీహెచ్ఎస్, నారాయణపూర్ | డి. బీరమల్లు, జెడ్పీహెచ్ఎస్, జూలపల్లి | బి.పోచయ్య జెడ్పీహెచ్ఎస్, పొట్యాల

ఆర్.నారాయణరావు, జెడ్పీహెచ్ఎస్, ఓదేడు | డి.వెంకటేశ్వర్లు, జెడ్పీహెచ్ఎస్, సుల్తాన్‌పూర్ | బి.జయప్రకాష్ జెడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి | పి.శంకర్, జెడ్పీహెచ్ఎస్, రామగుండం | జి.మల్లేశ్ యూపీఎస్, నాగారం | జి.దేవేందర్ జెడ్పీహెచ్ఎస్, కల్వచర్ల | ఎస్. ప్రభాకర్‌రావు జీహెచ్ఎస్, పెద్దపల్లి | వి.అంజయ్య జెడ్పీహెచ్ఎస్, ధర్మారం | జి.విష్ణు జెడ్పీహెచ్ఎస్, కనగర్తి | ఎన్.కనకయ్య ఎంపీపీఎస్, గుర్రాంపల్లి

టి.అరుణ యూపీఎస్, ఆంకంపల్లి | కె.వసంత యూపీఎస్, పోతారం | రఘుపతిరావు యూపీఎస్, అంతర్గాం | తస్లీంసుల్తానా యూపీఎస్, అంతర్గాం | జి.శ్రీలత ఎంపీపీఎస్, పత్తిపాక | సిద్ధిరాములు యూపీఎస్, ఖిలావనపర్తి | కె.వెంకటేశ్వర్లు ఎంపీపీఎస్, రాములపల్లి | వి.త్రివేణి ఎంపీపీఎస్, పెద్దాపూర్ | ఎస్.పుష్పలత ఎంపీఎస్, కమాన్‌పూర్ | బి.రజిత ఎంపీపీఎస్, మంథని

డబ్బులు ఇవ్వట్లే.. | తలనీలాలు పోగుచేసుకోవట్లే

• కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
• పేరుకుపోతున్న తలనీలాలు
• స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో ఆరబెట్టిన రాజన్న ఆలయ అధికారులు



స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో ఆరబెట్టిన తలనీలాలు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాల సేకరణకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఆలయ అధికారులకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. 4 నెలలుగా సదరు కాంట్రాక్టర్ ఆలయానికి డబ్బులు చెల్లించకపోవడమే కాకుండా కల్యాణకట్టలోని తలనీలాలను పోగుచేసుకోవడం లేదు. దీంతో అవి పేరుకుపోతున్నాయి. ఇటీవలి భారీ వర్షాలకు తలనీలాలు పాడవుతాయని అధికారులు భావించారు. గురువారం సదరు కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తుల సమక్షంలో రాష్ట్ర దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్(కరీంనగర్) సత్యనారాయణ పర్యవేక్షణలో స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో ఫ్యాన్ల కింద వాటిని ఆరబెట్టారు. ఆలయ ఏఈవో శ్రవణ్, పర్యవేక్షకుడు నర్సయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, ఎస్పీఎఫ్ బందోబస్తు మధ్య ఈ కార్యక్రమం చేపట్టారు.

చెక్కులు బౌన్స్.. కాంట్రాక్టర్‌కు నోటీసులు

వేములవాడ రాజన్నకు భక్తులు సమర్పించే తలనీలాలను పోగుచేసుకునే హక్కు కోసం ఆలయ అధికారులు రెండేళ్లకోసారి టెండర్లు పిలుస్తుంటారు. 2023-25 సంవత్సరానికి గానూ టెండర్ పిలవగా రూ.19.08 కోట్లకు సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ హిందూపూర్ దక్కించుకుంది. అయితే, సదరు కాంట్రాక్టర్ ఆలయానికి రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆయన ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా, ఫలితం లేకపోవడంతో కాంట్రాక్టర్‌తోపాటు ఆలయ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సమక్షంలోనే తలనీలాలను ఓపెన్ స్లాబ్‌లోకి తరలించి, సాయంత్రం వరకు ఆరబెట్టారు. తర్వాత వాటిని 55 బ్యాగుల్లో నింపి, స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు.

మెడికవర్ ఆస్పత్రిలో టీచర్స్ డే



ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లను సన్మానిస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రిలో వేడుకలు నిర్వహించారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణ, ప్రొఫెసర్లు పి.నితిన్, టి.రాజయ్య, ఆర్.సంజీవ్, ఎస్.రమేశ్ బాబు, వి.శ్రీనివాస్, ఎ.జ్యోతిలక్ష్మి, టి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సత్యప్రకాశ్, హరిజ్యోత్‌కౌర్, ఎం.ఆంజనేయులును సన్మానించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. గురువు భవిష్యత్తుకు బాటసారిగా నిలుస్తాడని, జ్ఞానాన్ని అందించే టీచర్ల రుణాన్ని విద్యార్థులు ఏ రూపంలోనూ తీర్చుకోలేరని అన్నారు. అలాంటి గురువులకు వైద్యపరంగా తమ వంతు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కిరణ్‌కుమార్, అనీష్ పబ్బ, రాంచందర్, దిలీప్‌రెడ్డి, నాగరాజు, తాహా, రవిమల్లారెడ్డి, కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.8 వేల జరిమానా విధిస్తూ పెద్దపల్లి జిల్లా జడ్జి డాక్టర్ హేమంత్‌కుమార్ తీర్పునిచ్చారు. గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు వివరాలు.. యైటింక్లయిన్‌కాలనీ గోపాల్‌నగర్‌కు చెందిన శిలారపు గట్టయ్య(40) అనే డ్రైవర్ 2018లో ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి గురువారం గట్టయ్యకు శిక్ష ఖరారు చేశారు. సాక్షులను ప్రవేశపెట్టి, నేరాన్ని రుజువు చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాస్ అభినందించారు.

సెల్లార్‌లోని షట్టర్లు కూల్చివేత

• సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దుకాణ సముదాయంపై చర్యలు



షట్టర్లను కూల్చివేస్తున్న జేసీబీ

సిరిసిల్లటౌన్: మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్‌కు చేదు అనుభవం ఎదురైంది. సిరిసిల్ల గోపాల్‌నగర్‌లో ఆయనకు దుకాణ సముదాయం ఉంది. అందులోని సెల్లార్‌లో షట్టర్లు నిర్మించారు. ఈ విషయం కొన్నేళ్లుగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ పలుమార్లు స్థానిక అధికారులకు, వరంగల్ ఆర్‌జేడీలోనూ ఫిర్యాదు చేశారు. అయినా స్పందన కరువైంది. దీంతో హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దుకాణాలు కూల్చివేయాలని ఆర్డర్ ఇచ్చింది. కోర్టు ఆర్డర్ ప్రకారం మున్సిపల్ అధికారులు వైస్ చైర్మన్‌కు నోటీసులు అందించినా ఆయన స్పందించలేదు. దీంతో బల్దియా అధికారులే స్వయంగా రంగంలోకి దిగి, గురువారం సదరు కాంప్లెక్స్ సెల్లార్‌లోని షట్టర్లను కూల్చివేశారు.

పూర్తిస్థాయిలో కూల్చాలి

గోపాల్‌నగర్‌లోని మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్‌కు చెందిన దుకాణ సముదాయంలోని సెల్లార్ షట్టర్లను పాక్షికంగా కూల్చివేశారు. నిబంధనలకు మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చాల్సి ఉంది. కోర్టు ఆర్డర్‌ను సైతం మున్సిపల్ అధికారులు బేఖాతర్ చేస్తున్నట్లు భావిస్తున్నాం. అక్రమ నిర్మాణాలను పాక్షికంగా కాకుండా పూర్తిస్థాయిలో కూల్చాలి. లేని పక్షంలో మళ్లీ కోర్టుకు వెళ్తాం.

– నాగుల శ్రీనివాస్, బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు

సమగ్ర భూ సర్వే చేయండి

• ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి
• సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

పెద్దపల్లిరూరల్: సమగ్ర భూ సర్వే చేసి, చెరువు, కుంటలను కబ్జా చేసి, నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చి, ఆక్రమణదారులపై కఠినచర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పెద్దపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించడం వల్లే ప్రజలు తిరస్కరించి, కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. చెరువు కబ్జాలను గుర్తించి, అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఐ ఆధ్వర్యంలో హైడ్రాకు విన్నవించామని తెలిపారు. హైదరాబాద్‌లో హైడ్రా చేస్తున్న పనులను ఆపుతామంటూ కొందరు దళారులు రంగప్రవేశం చేసి, అక్రమ నిర్మాణాలు చేపట్టినవారి నుంచి అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. అయితే, ఆక్రమణలను పూర్తిస్థాయిలో గుర్తించాలంటే సమగ్ర భూ సర్వే ఒక్కటే సరైన మార్గమని పేర్కొన్నారు. ఇటీవలి వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం అందించి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు మోహన్, గౌతం గోవర్ధన్, ఓదెమ్మ, స్వామి, సూర్య తదితరులున్నారు.

ఫోక్ సాంగ్స్ టు కన్నడ సినిమా

• అప్పన్నపేటకు చెందిన హోంగార్డుకు నటించే అవకాశం
• మహేశ్‌ను ఇన్‌స్ట్రాగామ్‌లో చూసిన అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్
• కృష్ణాష్టమి రోజు అక్కడి ప్రజలకు పరిచయం



పెద్దపల్లిరూరల్: ఫోక్ సాంగ్స్(జానపద పాటలు) పాడటం, వాటిలో నటించడం, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేటకు చెందిన హోంగార్డు అడప మహేశ్ హాబీ. సన్ననడుము చిన్నదానా, కుసుమపువ్వు తోటలో తదితర పాటలు అతనికి పేరు తీసుకువచ్చాయి. ఈ క్రమంలో మహేశ్‌కు ఉన్నట్టుండి సినిమాలో నటించే అవకాశం వచ్చింది. కన్నడ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్ ఇన్‌స్టాగామ్‌లో మహేశ్ ఫొటోను చూశారు. అచ్చం కన్నడ సినిమా ఆవేశయాలో నటించిన ప్రధాన పాత్రధారుడు బన్నంజేలా ఉండటంతో వెంటనే సంప్రదించారు. సినిమాలో అవకాశం ఇస్తానని చెప్పడంతో మహేశ్ కూడా అంగీకరించాడు. రాజేశ్ శ్రీకృష్ణాష్టమి రోజు కర్ణాటకలోని ఉడిపిలో నిర్వహించిన వేడుకలకు అతన్ని ఆహ్వానించి, సినీనటుడిగా అక్కడి ప్రజలకు పరిచయం చేశారు.

నేను ఊహించలేదు..



కన్నడ సినీ నటుడిలా నేను ఉండటం.. నా ఫొటోను ఇన్‌స్ట్రాగామ్‌లో చూసిన అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్ వేలాది మంది అభిమానుల మధ్య నన్ను నటుడిగా పరిచయం చేశారు. ఇది నేను ఊహించలేదు. పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న నాకు సినిమాలో అవకాశం ఇస్తున్నట్లు చెప్పగానే ఎంతో సంతోషించాను. ఫోక్ సాంగ్స్‌ను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్న నాకు ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

– అడప మహేశ్, అప్పన్నపేట, పెద్దపల్లి మండలం

కోతికి భయపడి, గుండెపోటు

• చికిత్స పొందుతూ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మృతి



వెంకటయ్య (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): కోతి భయపడిన ఓ వ్యక్తి గుండెపోటుకు గురయ్యాడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన ఎర్రవల్లి వెంకటయ్య (70) సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. మంగళవారం తన ఇంటి ఆవరణలోకి వచ్చిన కోతిని వెళ్లగొట్టే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో వానరం ఆయనపైకి రావడంతో భయపడ్డాడు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి చనిపోయాడు. గురువారం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

గంజాయి విక్రేతల అరెస్టు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. .. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ శివారులో గురువారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఇద్దరు యువకులు బైక్‌పై తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకొని, విచారించగా గంగాధర మండల కేంద్రానికి చెందిన కొడిమ్యాల అఖిల్, షేక్ ఖాసీం అని, గంజాయిని విక్రయించేందుకు వచ్చినట్లు తేలింది. గంగాధర మండలంలోని కాశిరెడ్డిపల్లికి చెందిన మధు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి, వారు కొంత తాగుతూ.. మిగతాది సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. బైక్‌తోపాటు, 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.